క్లుప్తంగా

సీఎంకు రుణపడి ఉంటాం

రాయదుర్గంటౌన్: 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల నియామకాలకు సంబంధించి జీఓ 27 విడుదల చేయడం పట్ల రాయదుర్గం డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు హర్షం వ్యక్తం చేశారు. ఆశలు వదలుకుని జీవిస్తున్న మా కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. తమ నియామకాలకు సంబంధించి కృషి చేసిన ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, డొక్కా మాణిక్య వరప్రసాద్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి అభ్యర్థులు గువ్వల ఎర్రిస్వామి, శర్మాస్‌సాబ్, మూష్టూర్‌రెడ్డి, సాయిరామ్, ఇబ్రహీం, యూనస్, ఈశ్వర్‌రెడ్డి, ప్రహ్లాద తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక



అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

ఉరవకొండ: స్థానిక రాంనగర్‌లో షాలేము క్రిస్టియన్ అసెంబ్లీ చర్చిలో ఉరవకొండ నియోజకవర్గ పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి అంతర్జాతీయ ప్రసంగీకుడు కింగ్సిమున్నంగి హాజరయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా జాన్, ఉపాధ్యక్షుడిగా పాస్టర్ ఇశ్రాయేలు ఎన్నికయ్యారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల పాస్టర్లు పాల్గొన్నారు.

మహిళలు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

కూడేరు: మహిళలు ఉన్నతస్థాయికి చేరుకోవాలని సర్పంచ్ ఓబుళమ్మ సూచించారు. గురువారం మండలంలోని కరుట్లపల్లిలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఆర్డీటీ సీహెచ్‌ఎస్ రాజశేఖర్ రెడ్డి, ఏటీఎల్ నల్లపరెడ్డి, సీఓ వన్నూరుస్వామి, చైల్డ్ హెల్ప్‌లైన్ సభ్యుడు సురేష్, మహిళా పోలీసు దేవి, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

దర్గా నూతన పీఠాధిపతి నియామకం



దర్గాలో స్వామి సమాధి వద్ద పీఠాధిపత్యం స్వీకరిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో వెలసిన సయ్యద్ సర్మస్ వలి చిష్తి దర్గాకు 8వ పీఠాధిపతిగా హజ్రత్ సయ్యద్ రహమతుల్లా బాద్ హుసేనీ చిష్తిని గురువారం నియమించారు. స్వామీజీ సయ్యద్ సర్మస్ వలి చిష్తి బోధనాలను అనుసరించి ఆయన అడుగుజాడల్లో నడుస్తూ దర్గా అభివృద్ధికి పాటుపడతానని నూతన పీఠాధిపతిగా అన్నారు. రాయచూరు, గుంతకల్లు, బళ్లారి తదితర ప్రాంతాల నుంచి ముతవల్లిలు, గురు పెద్దలు హాజరై నూతన పీఠాధిపతికి గురు బోధనలు చేశారు.

ఆస్పత్రిని పరిశీలన

రాయదుర్గం: జాతీయ ఆరోగ్య మిషన్ ఏటా అందించే కాయకల్ప అవార్డు ఎంపికలో భాగంగా రాయదుర్గం ఏరియా ఆస్పత్రిని రాష్ట్ర ఎక్స్‌టర్నల్ అసెస్మెంట్ బృందం సభ్యులు డాక్టర్ నాగలక్ష్మి, నాగేంద్ర గురువారం పరిశీలించారు. ఐసీయూ, ఆపరేషన్ థియేటర్, నవజాత శిశు సంరక్షణ కేంద్రం, ల్యాబ్, ప్రసూతి వార్డులు, లేబర్ రూమ్, ఎక్స్‌రే, ఏఆర్‌టీ, బ్లడ్‌స్టోరేజీ, బాత్‌రూమ్‌లు, పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. గుర్తించిన లోపాలను సరిచేసుకునేలా సంబంధిత అధికారులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ రామ్‌ప్రసాద్, ఫార్మాసిస్ట్ రాజన్న, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

తక్షణసాయం అందజేత



నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంబదూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో లక్ష్మీదేవి(38) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సచివాయల సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు మృతురాలి భర్త హనుమంతరాయుడికి రూ. 10 వేల తక్షణసాయం అందజేశారు. 'వైఎస్సార్ బీమా' కింద ప్రభుత్వం నుంచి రావాల్సిన మిగిలిన సొమ్ము లబ్ధిదారుల ఖాతాలో త్వరలో జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, సచివాలయ కన్వీనర్ గంగాధర, ఎంపీటీసీ మల్లేష్ప, నాయకులు రామస్వామి, గోపి, రాజు, బడిగి హనుమంతరాయుడు, శివ ప్రసాద్, మల్లికార్జున, ఆటో రాజు, కిరణ్, గురుస్వామి, పంచాయతీ కార్యదర్శి అనురాధ, వెల్ఫేర్ అసిస్టెంట్ శివలింగప్ప, వలంటీర్లు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో రాయదుర్గం జోరు

- ఏడేళ్ల తర్వాత రికార్డు స్థాయిలో మార్కెట్ ఆదాయం
- హర్షం వ్యక్తం చేస్తున్న పాలక మండలి సభ్యులు

ఫీజు వసూళ్ల వివరాలిలా..

సంవత్సరం	లక్ష్యం (కోట్లలో)	వసూలైన మొత్తం (కోట్లలో)
2016-17	రూ.1.66	రూ.69.16
2017-18	రూ.1.17	రూ.1.03.64
2018-19	రూ.1.25	రూ.1.05.38
2019-20	రూ.1.05	రూ.1.02.73
2020-21	రూ.1.24	రూ.30.16
2021-22	రూ.95	రూ.81.20
2022-23	రూ.1.15	రూ.1.16



రాయదుర్గం మార్కెట్ యార్డ్ కార్యాలయం

రాయదుర్గం: రాయదుర్గం వ్యవసాయ మార్కెట్ కమిటీ పన్నుల వసూళ్లలో దూసుకుపోతోంది. త్రైమాసిక ఏడాది పూర్తవ్వకనే నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంది. కరోనా దెబ్బతో డీలా పడిన మార్కెట్ యార్డులు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయి. పాలక వర్గాలు, అధికారుల సమష్టి కృషితో ఆదాయం రెట్టింపయ్యేలా పుంజుకుంది. 2015-16 లో లక్ష్యం రూ.96 కోట్లు కాగా, రూ.1.38.23 కోట్లు వసూళ్లు చేసి రూ.42 కోట్లను అదనంగా రాబట్టింది. ఆ తర్వాత కరోనా, మార్కెట్ వ్యవస్థలో కేంద్రం తీసుకొచ్చిన పలు మార్పుల కారణంగా లక్ష్యసాధన చేరుకోలేక చతికిలపడింది. 2022-23 వ త్రైమాసిక ఏడాదిలో 1.15 కోట్లను లక్ష్యం నిర్దేశించుకోగా, 14 రోజుల గడువుకు ముందే రూ.1.16 కోట్ల ఆదాయం రాబట్టి పన్నుల వసూళ్లలో జిల్లాలోనే ఆదర్శంగా నిలిచింది. ఏడేళ్ల తర్వాత ఇదే తొలిసారి కావడంతో ప్రశంశలు వెల్లువెత్తాయి.

ఆదాయం సమకూరేలా మార్గాలు..

మార్కెట్ యార్డుకు ఆదాయం సమకూర్చి లాభాల బాట పట్టించేలా మార్కెట్ యార్డు గౌరవాధ్యక్షుడు, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కీలక చర్యలు చేపట్టారు. ఈ ఏడాది వేరుశనగ కొనుగోలు, విక్రయాలను పట్టణంలోని దుకాణాల్లో కాకుండా మార్కెట్‌యార్డులోనే చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. టెండర్ పద్ధతిలో వ్యాపారం జరిగితే రైతుకు మద్దతు ధర లభించడంతో పాటు అన్నీ విధాల మేలు చేకూరుతుందన్నారు. అలాగే ప్రభుత్వానికి ఆధాయం కూడా సమకూర్చి మార్కెట్ వ్యవస్థను మరింత బలపరచవచ్చని విప్ సూచించారు.

లక్ష్యాన్ని అధిగమించాం



ఏడేళ్ల తర్వాత మార్కెటింగ్ శాఖ ఆదాయం రెట్టింపయింది. 2022-23లో రూ.1.15 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటికే రూ.1.16 కోట్ల వసూళ్లను పూర్తిచేశాం. ఈ నెలాఖరు లోగా ఈ మొత్తం మరింత పెంచేలా ప్రణాళిక చేపట్టాం. విప్ కాపు, చైర్మన్, వైస్ చైర్మన్, పాలక పక్షం ఆదేశాల మేరకు రాబడి పెంచే మార్గాలన్నింటిని అన్వేషిస్తున్నాం.

– సునీత, మార్కెట్‌యార్డ్ కార్యదర్శి, రాయదుర్గం

రైతు సంక్షేమానికి కృషి



చింతపండు మార్కెట్ తరహా వచ్చే సీజన్‌లో వేరుశనగ టెండర్ మార్కెట్ నిర్వహించేలా చర్యలు చేపట్టాం. ఇప్పటికే ట్రేడర్స్‌తో సమావేశం కూడా పూర్తి చేశాం. ఈ ఏడాది టార్గెస్‌ను రీచ్ కావడం, మార్కెట్‌యార్డుకు మంచి పేరు రావడం సంతోషంగా ఉంది. ఇందుకు అధికారులు, మార్కెట్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు. – భోజరాజ్‌నాయక్, చైర్మన్, మార్కెట్ యార్డ్

పప్పుశనగ కొనగోలు కేంద్రం ప్రారంభం



ఉరవకొండ: రాయంపల్లిలో పప్పుశనగ కొనగోలు కేంద్రం ప్రారంభించిన మార్క్‌ఫెడ్ అధికారులు



కణేకల్లు: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు తిమ్మప్పచౌదరి, సీఈఓ హనుమంతు

ఉరవకొండ/కణేకల్లు: ఉరవకొండ మండలంలోని రాయంపల్లి సచివాలయం వద్ద పప్పుశనగ కొనగోలు కేంద్రాన్ని ఉరవకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో పప్పుశనగ కోనగోలు చేయనున్నారు. సీఈఓ గౌస్ మాట్లాడుతూ రైతులు పండించిన పప్పుశనగను మద్దతు ధర క్వింటాల్ రూ.5,335 తో కొనగోలు చేస్తామన్నారు. పంటను అమ్మదలచిన రైతులు ఆయా గ్రామాలలోని రైతుభరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకుని ఉండాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు. అలాగే కణేకల్లులోని రామ్‌నగర్‌లో రూరల్ బ్యాంకు గోదాము వద్ద పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని సీఈఓ హనుమంతుతో కలిసి పీఏసీఎస్ అధ్యక్షుడు తిమ్మప్పచౌదరి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకోవాలనే మంచి ఉద్దేశ్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కనీస మద్దతు ధరతో పప్పుశనగను కొనుగోలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ సిబ్బంది, ఎంపీఈఓలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక



విద్యార్థిని సత్కరిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వతరగతి విద్యార్థి సాయిక్రిష్ణ రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యాడు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థి ఫింగర్ ప్రింట్ బేస్‌డ్ఆన్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ఉంచినట్లు ప్రధానోపాధ్యాయుడు నాగేంద్రప్ప తెలిపారు. ఇందులో మొదటి బహుమతి సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థికి గైడ్‌గా ఉపాధ్యాయురాలు శ్యామ్యూల్‌మణి వ్యవహరించారన్నారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచు మోనాలిసా, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి నల్లబోతుల రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉగాది వేటకు నీలగిరిస్వామి



వజ్రకరూరు: మండల కేంద్రంలోని నీలగిరి స్వామి గురువారం సాయంత్రం ఉగాది వేటకు బయలుదేరి వెళ్లారు. ఏటా ఉగాది పండుగకు ముందు నీలగిరిస్వామి వేటకు బయలుదేరి వెళ్లడం ఆనవాయితీ. గురువారం సాయంత్రం ఆలయంలో స్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి ఉగాది వేటకు బయలుదేరారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ స్వామి వజ్రకరూరు నుంచి కోనాపురం, పెనకలపాడు, రేణుమాకులపల్లి, లత్తవరం, కమలపాడు, తట్రకల్లు గ్రామాలకు వెళ్లి ఈ నెల 22న (ఉగాది) సాయంత్రం వజ్రకరూరుకు చేరుకుంటారన్నారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు

కళ్యాణదుర్గం/రాయదుర్గం టౌన్/బొమ్మనహాళ్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం సజావుగా ప్రారంభమయ్యాయి. కళ్యాణదుర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ మోడల్ కళాశాల, వివేకానంద ప్రైవేట్ కళాశాలల్లో జరిగిన పరీక్షకు 1085 మంది విద్యార్థులు హాజరుకాగా 30 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. రాయదుర్గం పట్టణంలో 993 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 20 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పర్యవేక్షించింది. అలాగే మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 236 యంది విద్యార్థులకు గాను 227 మంది పరీక్ష రాశారని ప్రిన్సిపాల్ ఆంజనేయులు తెలిపారు.

నేటి నుంచి తాగునీటి కార్మికుల సమ్మె

కూడేరు: డిమాండ్ల సాధనలో భాగంగా శుక్రవారం నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు శ్రీసత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి పథకాలకు సంబంధించిన కార్మిక సంఘం నేతలు స్పష్టం చేశారు. గురువారం ఆయా సంఘాల నేతలు తిప్పయ్య, మగ్బూల్, నాగరాజు, రాముడు, వన్నూరు స్వామి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పీఎఫ్, ఈఎస్ఐ, వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు. గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి పలుమార్లు సంబంధింత అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో సమ్మె అనివార్యమైందని పేర్కొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



భవిత కేంద్రంలో ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ శ్రీధర్

శెట్టూరు: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. గురువారం భవిత కేంద్రంలో ఎంఈఓ శ్రీధర్ దివ్యాంగులకు వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్‌ను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో దివ్యాంగులకు ర్యాంప్, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ రాంప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

104 వైద్యసేవలు

బ్రహ్మసముద్రం: మండలంలోని ముప్పలకుంటలో మండల వైద్యాధికారి అఫ్తాఫ్ ఆధ్వర్యంలో 104 వాహనం ద్వారా గురువారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే గర్భిణులు, చిన్న పిల్లలు, వృద్ధులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నారాయణనాయక్, ఏఎన్ఎం వన్నూరమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ దీప్తి, అంగన్‌వాడీలు తిప్పమ్మ, నింగమ్మ, ఆశావర్కర్లు ప్రభావతి, రంజిత పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద సూర్య సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి హాజరై తొలి రోజు చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. సూర్యసేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీరెడ్డి, మల్లికార్జున, సభ్యులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే పయ్యావుల డ్రామా

- వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కాకర్ల నాగేశ్వరరావు

వజ్రకరూరు: ఉరవకొండ నియోజకవర్గంలో టీడీపీకి ప్రజాదరణ కరువైందని, ఈ క్రమంలో ఉనికి చాటుకునేందుకు అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కొత్త డ్రామాలకు తెరలేపారంటూ వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కాకర్ల నాగేశ్వరరావు మండిపడ్డారు. గురువారం సాయంత్రం వజ్రకరూరులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే కేశవ్ ప్రవర్తించిన తీరు నియోజకవర్గ ప్రజలకు తలవంపులు తెచ్చేలా ఉందన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు ప్రస్తావించకుండా ప్రభుత్వంపై అనవసర విమర్శలు చేస్తూ కాలాన్ని వృధా చేయడం సరికాదన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో నియోజకవర్గం అన్నింటా అభివృద్ధి సాధించిందని, ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని, ఇలాంటి తరుణంలో అసెంబ్లీలో చర్చించేందుకు నియోజకవర్గ సమస్యలేవీ లేకపోవడంతో తనకిచ్చిన విలువైన సమయాన్ని ప్రభుత్వంపై బురదచల్లేందుకే కేశవ్ వాడుకున్నారని మండిపడ్డారు.

పశుగ్రాసం దగ్ధం.. రూ.60 వేల నష్టం

బొమ్మనహాళ్: మండలంలోని వన్నల్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదంలో పశుగ్రాసం పూర్తిగా కాలిపోయింది. వన్నల్లి గ్రామానికి చెందిన రైతులు వన్నారెడ్డి, నరసింహులు జొన్న సొప్ప, వేరుశనగ, వరి గడ్డితో 2 వాములను నిల్వ చేసుకున్నారు. మధ్యాహ్నం ప్రమాదవశాత్తు గడ్డివాములకు నిప్పు అంటుకుంది. ఉరవకొండ అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. అప్పటికే పశుగ్రాసం పూర్తిగా కాలిపోయింది. దాదాపు రూ.60 వేల వరకూ నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని వారు కోరారు.

గుడిసె దగ్ధం : ఉరవకొండ: స్థానిక ఆంధ్రప్రగతి బ్యాంకు ఎదురుగా ఉన్న కాలనీలో దినసరి కూలీలు ఆంజినేయులు, మారెక్క నివస్తున్న గుడిసె బుధవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. ఈ ఘటనలో ఇంట్లో దాచిపెట్టుకున్న కూలి డబ్బులు రూ.10 వేలతో పాటు నిత్యావసర సరుకులు, దుస్తులు కాలిబూడిదయ్యాయి. సర్వం కోల్పోయామని, అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధితులు కోరారు.

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం





కళ్యాణదుర్గం, ఉరవకొండలో అమరజీవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రాయదుర్గంలో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

కళ్యాణదుర్గం: అమరజీవి పొట్టి శ్రీరాములు రాష్టానికి చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. అమరజీవి జయంతిని పురస్కరించుకుని కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళ్యాణదుర్గంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, సచివాలయ కన్వీనర్ అర్చన, మాజీ మండల కన్వీనర్ తిరుమల వెంకటేశులు, కౌన్సిలర్ అబ్రహాం, నాయకులు కిరిటీ యాదవ్, శ్రీకాంత్, హేమ, రూప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ సర్కిల్‌లో అన్నదానం చేపట్టారు. ఉరవకొండ పట్టణంలో నిర్వహించిన అమరజీవి జయంతి కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, ఈఓ గౌస్‌సాహెబ్, ఎంపీపీ చందా చంద్రమ్మ, జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు మీనుగ బసవరాజు, పార్టీ రాష్ట్ర నాయకులు ఓబన్న, వార్డు సభ్యుడు నిరంజన్‌గౌడ్, కోఆప్షన్ సభ్యుడు పామిడిసలీం, పార్టీ మైనార్టీ విభాగం కన్వీనర్ పామిడిజాకీర్, మైనార్టీ నాయకులు అన్వర్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. రాయదుర్గం పట్టణంలోని వాసవీమాత ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జయంతి సురేష్‌కుమార్, అవోపా అధ్యక్షుడు వెంకటరమేష్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రె, డీఈ రామ్మూర్తి, ఆర్వో కొండన్న సిబ్బంది పాల్గొన్నారు. కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. అలాగే డి హీరేహాళ్ మండలంలోని హొసగుడ్డం ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మెన్ ఉమేష్, ఉపాధ్యాయురాలు శ్రీదేవి పాల్గొన్నారు. గుమ్మఘట్ట మండంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పొట్టి శ్రీరాములు జంయతి ఘనంగా నిర్వహించారు. వజ్రకరూరు మండల కేంద్రంలోని గ్రంథాలయంలో నిర్వహించిన పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మునెమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఉపాధ్యాయుడు మహబూబ్‌బాషా, సామాజిక కార్యకర్త వలి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

రాయదుర్గం: డి హీరేహాళ్ మండలంలోని పూలే గురుకుల బాలికల పాఠశాలలో గురువారం ప్రిన్సిపాల్ నారాయణస్వామి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్పందన ఇంటర్నేషనల్ ఫౌండేషన్ అధినేత శ్యామూల్‌రెడ్డి, వైస్ చైర్మన్ కావలి ఈశ్వర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా ముందుగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పంచుకోవాలన్నారు. సొంత నిర్ణయాలు తీసుకుని జీవితాలనే పణంగా పెట్టుకోవద్దని హితవు పలికారు. ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదన్నారు. అనంతరం పదో తరగతి చదివే విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం నుంచి సామాజిక తనిఖీలు ప్రారంభం కానున్నాయి. 2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 వరకూ మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి హామీ పనులపై తనిఖీలు నిర్వహించనున్నారు. మొత్తం రూ.15.62 కోట్లకుపైగా ఖర్చు చేసి చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించనున్నారు. ఇప్పటికే సామాజిక తనిఖీ బృందం మండల కేంద్రానికి చేరుకుని రికార్డులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఉపాధి పథకం కింద దకొట్స్, హార్టికల్చర్, కందకాలు తదితర వాటితోపాటు పంచాయతీరాజ్ కింద చేపట్టిన గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలు, బల్క్‌మిల్క్ కేంద్రాలు, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ కేంద్రాలు, పాఠశాలల ప్రహరీ నిర్మాణాలు, ఆర్‌డబ్ల్యూఎస్ పథకం కింద సీసీ ఓపెన్ డ్రైనేజీ తదితర పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించనున్నట్లు స్టేట్ రీసోర్స్ పర్సన్ తులసీనాయక్, సీనియర్ డీఆర్పీ చెన్నపయ్య తెలిపారు. శుక్రవారం నుంచి ఈ నెల 23 వరకూ గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి అనంతరం మండల కేంద్రంలో ఓపెన్ ఫోరం ఏర్పాటు చేస్తామన్నారు.

రైతు ఆత్మహత్య



సంజీవ(ఫైల్)

కూడేరు: మండలంలోని కలగళ్లకు చెందిన పెద్దన్న కుమారుడు సంజీవ(28) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలు మేరకు.. సంజీవకు మూడు ఎకరాల పొలం ఉంది. వ్యవసాయ పనుల కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్‌కు మూడు నెలలకొకసారి రూ.90 వేలు కంతు చెల్లించాల్సి ఉంది. ఈ నెల 23న కంతు చెల్లించాల్సి ఉంది. అప్పు చేసి సాగు చేసిన పంటలు ఆర్థికంగా ఆదుకోలేకపోయాయి. అప్పు, కంతు చెల్లించే మార్గం కానరాక మూడు రోజులు క్రితం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంలో బయటకు వెళ్లాడు. గాలింపు చర్యలో భాగంగా గురువారం కుటుంబ సభ్యులు గార్లదిన్నె మండల పెనకచెర్ల డ్యాం సమీపాన చెట్టుకు ఉరేసుకుని మృతిచెందినట్లు గుర్తించారు. అతడికి ఇద్దరు కుమార్తెలున్నారు. భార్య ప్రస్తుతం ఆరు నెలల గర్భిణి. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు జమేదార్ వెంకటేశులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

విద్యుత్‌షాక్‌తో గేదెల మృతి

కణేకల్లు: మండలంలోని తుంబిగనూరు గ్రామంలో విద్యుత్‌షాక్‌కు గురై రెండు పాడి ఎనుములు మృతి చెందాయి. గురువారం సాయంత్రం మేతకు వెళ్లిన ఎనుములను ఇంటికి తోలుకు వస్తుండగా రైతులు ప్రభాకర్‌రెడ్డి, వెంకటరెడ్డికి చెందిన ఎనుములకు మార్గమధ్యంలో వేలాడుతున్న 11 కేవీ విద్యుత్‌వైర్లు తగిలాయి. వెంటనే విద్యుత్ షాక్‌తో రెండు ఎనుములు మృతిచెందాయి. వాటి వెనుక వస్తున్న ప్రభాకర్‌రెడ్డికి ప్రమాదం త్రుటిలో తప్పింది. గ్రామస్తుల నుంచి సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు వెంటనే కరెంటు సరఫరా నిలిపేశారు. పాడి ఎనుముల మృతితో ఒక్కొక్కరికి రూ.50 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

బహిరంగ ప్రకటన

మా కక్షిదారులయిన కీ.శే. పెద్దకోట్ల రామప్ప కుమార్తె జి.విజయ W/o. G.D.P.V. గోపాలక్రిష్ణ మరియు కీ.శే. పెద్దకోట్ల కాంతప్ప కుమారుడు లక్ష్మన్న మరియు ద్వారకనాథ్ కుమార్తె పైన రేవతి మరియు మనవళ్ళు అయిన శ్రీధర్ మరియు శ్రీనివాసులు అనువారలు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తుల గురించి భాగపరిష్కార నిమిత్తము అనంతపురము జిల్లా కోర్టులో O.S. No : 31/2021 దావాలో షెడ్యూలు దాఖలా ఆస్తుల క్రయ విక్రయములో పై కోర్టు తీర్పునకు బద్ధులై ఉండవలెనని 16-07-2021 తేదీన పి. క్రిష్ణస్వామి కుమార్, అడ్వకేట్ అనంతపురము వారు, మరియు 16-09-2022న వి.రవిశంకర్‌రెడ్డి, అడ్వకేట్, అనంతపురము వారు పై తేదీల్లో సాక్షిదినపత్రిక నందు బహిరంగ ప్రకటన ఇచ్చియున్నాము. కాగా ప్రస్తుతం పై కేసులో భాగస్వాముల మధ్య మా శ్రేయస్కులైన కొంత మంది పెద్దమనుషుల సమక్షంలో సంధి, సర్దుబాటు చేసుకొని 06-03-2023 తేదీ నాడు పరిష్కరించుకొని కేసును రాజీ చేసుకున్నాము అని పత్రికా మూలకము తెలియజేయడమైనది. దీనిపై ఇతరులు జరుపు క్రయ విక్రయాలకు నా కక్షిదారులకు ఎటువంటి అభ్యంతరం లేదని తెలపడమైనది.

షెడ్యూలు

ఉరవకొండ మండలం, బూదగవి గ్రామం పొలంలోని ఆస్తి

ఐటమ్ నెం. 1 : సర్వే నెం. 219, A.C. 7.09 సెంట్లు ఫుల్.
ఐటమ్ నెం. 2 : సర్వే నెం. 234, A.C. 12.56 out of this S.No. 234/1, A.C. 6.04 Cents.
ఐటమ్ నెం. 3 : సర్వే నెం. 344, A.C. 2.26 సెంట్లు ఫుల్.
ఐటమ్ నెం. 4 : సర్వే నెం. 347-A, A.C. 5.00 Cents ఫుల్, సర్వే నెం. 348-A, A.C. 2.90 సెంట్లు ఫుల్.
ఐటమ్ నెం. 5 : సర్వే నెం. 363B, A.C. 18.24 సెంట్లు ఫుల్.

వి. రవిశంకరరెడ్డి, అడ్వకేటు, అనంతపురము, సెల్ : 9440557277
పి. క్రిష్ణస్వామి కుమార్, అడ్వకేటు, అనంతపురము.